

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

## (పాలకోడేరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 5-4-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

వేదాల సారమే రామాయణంగావచ్చిందని, వేదాలలో ప్రతిపాదించిన పరమాత్మే రాముడిగా వచ్చాడని రామాయణం క్షుణ్ణంగా పరిశీలించినవారు చెపుతారు. భారతీయులలో ఎక్కువమంది రామనామం చేస్తారు. రామచంద్రమూర్తి అంటే ఆనందం, ప్రేమ, వెలుగు రామాయణం చదివిమనం నేర్చుకోవలసినది చాలా ఉంది. సేవాభావం ఎలా ఉంటుందో మీరు నేర్చుకోవాలంటే రామాయణం చదవాలి. ధర్మ, అర్థ, కామ, మోక్షముల గురించి రామాయణంలో సమగ్రంగా చెపుతారు ధర్మానికి అనుగుణమైన సంపాదన, కోరిక ఉండాలి. అర్థ కామములు విచ్చలవిడిగా ఉండకూడదు. మీసంపాదన, కోరిక ధర్మబద్ధంగా లేకపోతే తమోగుణం, రజోగుణం విడిచిపెట్టవు. నీ మనస్సు అణగదు, సత్వగుణం అభివృద్ధికాదు. సత్వగుణం అభివృద్ధి కాకపోతే ఎవరికీ మోక్షసుఖం పొందటం సాధ్యం కాదు. మనకు హృదయాలయంకంటే దేవాలయం అంటే ఇష్టం. హృదయాలయంలో ఆత్మారాముడు ఉన్నాడు. దేవాలయంలో రాముని విగ్రహాలు ఉన్నాయి. మన దేహం ఎంత నిజమో రాముని విగ్రహాలు కూడా అంతే నిజం. నిజమైన రాముడు  హృదయాలయంలో ఆత్మారాముడిగా ఉన్నాడు.

వనవాసంలో రామచంద్రమూర్తి కొంతకాలం చిత్రకూటమిపర్వతం దగ్గర ఉంటారు. అక్కడ భరతుడు రాముడిని కలుసుకొని కైకేయి పొరపాటు చేసింది,ఇప్పుడు సవరించుకోవాలి, ఉద్రేకం మీద అలా కోరింది. ఇప్పుడు మీరు అయోధ్యకు రావాలి, పరిపాలన చేయాలి అని అడుగుతాడు. అప్పుడు రాముడు తండ్రిగారి ఆజ్ఞప్రకారం నేను వనవాసం చేసి వస్తాను అప్పటివరకు నీవు పరిపాలన చెయ్యిఅని భరతుడితో చెప్పాడు. భరతా ఇది నీతల్లి కోరిక కాదు. ఇది ఈశ్వర సంకల్పం. ఈ ఉపాధిలో నేను అరణ్యవాసం చేయవలసి ఉంది. అందువలన నీతల్లి మీద విరోధం పెట్టుకోవద్దు, ప్రేమగా ఉండు అని రాముడు చెప్పాడు. అది శరణాగతి. అప్పుడు భరతుడు రాముడితో నన్ను పరిపాలన చేయమని చెపుతున్నారు. కాని తేడా ఎక్కడ ఉంది అంటే మీరు పరిపాలన చేస్తున్నారు అనుకోండి ప్రజలు అందరూ మీకు అనుగుణంగా  ఉంటారు. నేను పరిపాలన చేస్తేనేను ప్రజలచుట్టూ తిరగాలి అని చెప్పాడు. చిత్రకూటమి పర్వతం దగ్గర మందాకిని నది ఉంది. ఆనది గురించి దేవికి చెపుతూరాముడు ఈనది చాలా పవిత్రమైనది. ఎందుచేతపవిత్రమైనది అంటే రాగద్వేషములు లేని వ్యక్తులు, కామక్రోధములు జయించిన వ్యక్తులు, ఎంతో తపస్సు చేసి తపోధనం సంపాదించిన వ్యక్తులు పూర్వం ఎంతో మంది

ఈనదిలో స్నానంచేసి ఈనదినిపవిత్రంచేసారమ్మాదేవి అని రాముడు సీతతో ఆనదిగురించి చెప్పాడు.

వాలి ఎంత బలవంతుడో వాలి భార్య అంత జ్ఞాని. సుగ్రీవుడికి రాముడితో స్నేహం అయ్యాక వాలిని యుద్ధానికి రమ్మంటాడు. అనేకసార్లు ఓడిపోయాడు మరలయుద్ధానికి రమ్మంటున్నాడు ఏమిటి అనివాలికి అర్ధం కాలేదు. అప్పడు తార వాలితో అంటుంది ఇంతకు ముందు చాలాసార్లు జడిసిపారిపోయాడు మరల ఇప్పడు యుద్ధానికి రమ్మంటున్నాడు అంటే నీకంటే బలవంతుడి ఆశ్రయం అతనికి దొరికి ఉంటుంది అని చెప్పింది. కాని వాలికి అహంభావన ఉంది ఏమిటి అంటే వాడికి ఎవడైనా ఆశ్రయం దొరికినా వాడిని కూడానేను చంపగలను అనుకొంటాడు. అప్పడు తార వాలితో చెపుతుంది. మీరు తప్పచేసారు అని అనదు, చెడ్డపనులు చేస్తే, చెడ్డమాట్లాడితే కలహాలు, కక్షలు, అసూయలు అన్నీవస్తాయి. మంచి పనులు చేస్తే ఎందుకు వస్తాయి వాలి అని చెపుతుంది. ఆ మాటలలో ఉన్న వైభవం చూడండి. నీవు తప్ప చేసావు అని చెప్పకుండా చెప్పటం చివరలో వాలి నేల మీద పడి ఉంటాడు. అప్పడు తార వాలితో అంటుంది నేను అంటే నీకు ఎంత ఇష్టమో కాని ఇప్పడు నాకంటే నీకు నేల ఇష్టమయింది, నేలను కౌగిలించుకొన్నావు. పూర్వం నన్ను కౌగిలించుకొన్నావు ఇప్పడు నేలను కౌగిలించుకొన్నావు అని చెపుతుంది. అంటే ఆలోచన లేనిపనులు చేస్తే ఇటువంటి ప్రమాదాలు వస్తాయి అని చెపుతోంది.

రావణుడికి ఆయన దగ్గర ఉన్న మంత్రి ఒక ఉపాయంచెపుతాడు. నీకు భార్యగా ఉండటానికి సీత అంగీకరించటంలేదు. సీత దగ్గరకు వెళ్ళి నీ శక్తిగురించి, నీగొప్ప తనం గురించి చెపుతున్నావు. అలా చేయటం వలన ప్రయోజనంలేదు. ఏ రూపం ధరించాలంటే ఆరూపం ధరించే శక్తి నీకు ఉంది. అందువలన నీవు రాముని రూపంధరించు. అప్పడు సీత నిన్ను అంగీకరిస్తుంది అని సలహా చెప్పాడు. అప్పడు రావణుడు అంటాడు నీవు చెప్పినట్లుగా నేను రాముని రూపం ధరిస్తే నాలో ఉన్న కామం చచ్చి పోతుంది అప్పడు సీతను నేను ఏమి చేసుకొంటాను అన్నాడు అదీ రాముని యొక్క వైభవం. ఇక్కడ రాముని యొక్కవైభవాన్ని రావణాసురుడే చెపుతున్నాడు. భక్తి అభివృద్ధి చేసుకోవాలంటే అన్ని వస్తువులలో రాముడినే చూడు అన్నాడు రామదాసు. వారి రూపాలు, గుణాలు నీకు అనవసరం. అందరిలో రాముని చూడటం నేర్చుకో, వారికి ధనం ఉండవచ్చు, లేకపోవచ్చు, పాండిత్యం ఉండవచ్చు లేకపోవచ్చు. అందరి హృదయాలలో ఉన్న రాముని చూడటంనేర్చుకో. అప్పడు నీకు ఆత్మానుభవం కలుగుతుంది. మీకు దైవీగుణాలు లేకపోతే, దైవీసంపదలేకపోతే ఎన్ని ప్రాణాయామములు చేసినా, ఎన్నిగుడులు చుట్టూతిరిగినా నీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేయదు. ఎదుటివారిలో ఉన్నచెడును చూడవద్దు, మంచినేచూడు. ఏవిషయంలోనూ అతిపనికిరాదు.

పూర్వజన్మలో మనం చేసిన పనులు మన అలవాట్లు, వాసనలు ఈ జన్మలో స్వభావంగా

వచ్చాయి. మానవుడు తన స్వభావాన్ని మార్చుకోవటం చాలాకష్టం. ఎంతో తపస్సు ఉంటే గాని, ఈశ్వరానుగ్రహం ఉంటే గాని మానవుడు తన స్వభావమును మార్చుకోలేడు. మీ భక్తినిజమైతే, మీరు సిన్సియర్‌గా ప్రయత్నంచేస్తే భగవంతుని అనుగ్రహం మీకు అందుతుంది. భక్తులను విమర్శిస్తారు. కాని భక్తులు వ్రాసిన కవిత్వాలు సజీవంగా ఉన్నాయి కాని లౌకికులు వ్రాసినవి ఇవాళ వ్రాస్తే రేపు ఎండిపోతున్నాయి. భక్తులు కానివారు వ్రాసిన కవిత్వాలు ఎక్కడైనా నిలబడి ఉన్నాయేమో చూడండి. రాగద్వేషాల మధ్యన కూర్చొని వ్రాస్తే ఇవాళ ఉంటుంది రేపటికి ఎండిపోతుంది. పని చేయటం కష్టం, విమర్శించటంతేలిక. మానవజాతి మీద ప్రేమ లేనప్పుడు కవిత్వంఎలా వస్తుంది. భగవంతుని సంకల్పమే జరుగుతుంది. నీ సంకల్పమే నెరవేరుతుంది నీ సంకల్పమే నా సంకల్పము అనుకొనేవాడు నిజమైన భక్తుడు. ఎవడైతే తన మనస్సును రామచంద్రమూర్తికి అర్పించుకొన్నాడో వాడే నిర్మలంగా, నిరహంకారముగా ఉండగలడు. అగ్నిహోత్రంలాంటి వేడిని పుట్టించే కష్టాల మధ్యనకూడా వాడు నిర్మలంగా ఉంటాడు. వనవాసంలో ఒకసారి రాముడుసీతతో అంటాడు మనస్సు, మాట శరీరం ఇవి మూడు స్వాధీనంలో ఉంటే అయోధ్యలో ఉంటే ఏముంది, అరణ్యంలో ఉంటే ఏముంది ఎక్కడ ఉంటే ఏముంది ఇవి మూడు స్వాధీనంలో ఉన్నవాడికి ఎక్కడ ఉన్నా ఒక్కటే దేవీ సీతా అంటాడు రాముడు.

**(ఆగర్రులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 6-4-98)**

***ప్రియమైన ఆత్మబంధువుల్లారా,***

రామదాసు నిరంతరము రామనామం జపించేవారు. మీరు అనేక రకాల సాధనలు చేసి ఏదైతే సాధించాలి అనుకొంటున్నారో రామనామం చేయటం వలన అది సాధించవచ్చు అని రామదాసు చెప్పాడు. రామనామం నిరంతరం జపించటం వలన రాగద్వేషములు అణిగిపోతాయి. మనకు తెలియని మురికి గుంటలు మనస్సులో చాలా ఉంటాయి. రామనామంచేయటంవలన మన మనస్సులో వున్న మురికి గుంటలు తీసేస్తాడు బుద్ధిలో ఏమైనా హెచ్చుతగ్గులు వుంటే రామనామం వాటిని సరిచేస్తుంది. రామనామం ఆనంద ప్రదమైనది, శాంతి ప్రదమైనది, జ్ఞానప్రదమైనది. ఎవరైనా కోరికలు పెట్టుకొని దేవుని ప్రార్థిస్తూ ఉంటే మనం వారిని చెడగొట్టకూడదు. సకామభక్తి కూడా నిష్కామభక్తికి దారి తీస్తుంది, కోరికలు నెరవేరినపుడు భగవంతుని మీద విశ్వాసం కలుగుతుంది. తరువాత ఈ కోరికలు ఎంతకాలం ఉంటాయి, ఈ శరీరం ఎంతకాలం ఉంటుంది అని వారి మనస్సు నెమ్మదిగా నిష్కామభక్తి మీదకు వెళుతుంది. ముందు సకామభక్తి వస్తుంది తరువాత అది నిష్కామ భక్తికి దారితీస్తుంది. నిష్కామభక్తి హృదయంలో ఉన్న వస్తువులో లయమవ్వటానికి సహకరిస్తుంది. మనకు శారీరకమైన బాధవస్తే మానసికమైన బాధవస్తే దానిని తొలగించమని దేవుని ప్రార్థిస్తాము ఆర్థికంగా ఇబ్బందివస్తే దాని నుండి ఒడ్డుకు తీసుకొనిరా అని భగవంతుని ప్రార్థిస్తాము. వీరిని ఆర్తుడు, అర్థార్థి అంటారు. వీరు సకామభక్తులు ఇంక జిజ్ఞాసువు, జ్ఞాని